# ఉదయం

వాడు వెంట తరుముతున్నాడు!

సాంబయ్య ఆగి వెనక్కి తిరిగి చూసేడు. వెనక ఎవరూ లేరు వెనక చీకట్లో తారురోడ్డు నిర్మానుష్యంగా కనిపిస్తోంది. రోడ్డుపక్క కొబ్బరి చెట్లు నిర్జీవంగా కనిపిస్తున్నాయి. పక్కన మహాసముద్రం మింగేసేట్టుగా అరుస్తోంది. వెనకా ముందూ పక్కా కూడా ఎవరూ కనిపించలేదు సాంబయ్యకి. కాని వాడు వెంట తరుముతున్నాడు. ఎక్కడో కనిపించ కుండా నక్కేసేడు. అంతే.

సాంబయ్యకి ఎన్నడూ లేనంతగా భయంవేసింది.

తెల్లవారుఝామున ఈ చీకట్లో తను ఒంటిగాడై పోయేడు. ఒంట రిగా ఉన్న ఈ సమయంలో వాడొచ్చి పీకనొక్కేస్తే ఏంచెయ్యడం.

సాంబయ్యకి డెబ్బయ్యేళ్ళు దాటిన రోజున పెన్షన్ పుచ్చుకొని సాయంకాలం నెమ్మదిగా నడుచుకుంటూ వస్తూంటే వెన్నున ఎవరో వస్తున్నట్టు, నీడలా చప్పుడు చెయ్యకుండా వస్తున్నట్టు తోచింది.

ఎవడో కనిపించలేదుగాని ఆ క్షణంలో అనిపించింది.

“వాడే!”

రోడ్డుమీద ముందున ఒక బండీ తూగుతూ నడుస్తోంది.

వెనకనొక బాలుడు చిన్న బండిని తోసుకుంటూ వస్తున్నాడు.

అంతే, మరెవరూ లేరు.

కాని. "వాడే." వాడు వెంట తరుముతున్నాడు!

వాడు నెత్తికోతలవాడు; బహుదుర్మార్గుడు; బందిపోటు దొంగ; పరమ పోకిరీ; మహారౌడీ, దెబ్బలాడ్డానికి సాంబయ్యకి శక్తిలేదు. వాడు కనిపించడు; దొరకడు. ఒకుపుచూసుకొని దెబ్బతీసేడం మాత్రం తీసేస్తాడు.

ఇప్పుడీ రోజున ఒంటరిగా, అనవసరంగా బయద్దేరేడు.

"మార్నింగ్ వాక్" అంటూ.

డాక్టరు "ఎక్కడికీ కదలొద్దు, తిరగొద్దు" అంటూనేఉన్నా విన్నాడు కాడు.

ఇప్పుడు తను ఒంటరిగాడై పోయేడు.

వాడు తరుముతున్నాడు.

"వీణ్ణెలా ఒదుల్చుకోడం?"

కాల్చుకు తినేస్తున్నాడు.

యమబాధ పెట్టేస్తున్నాడు.

"వీడితో చచ్చి చావొచ్చింది."

భయం తగ్గడానికి చేతి కర్ర నేలనివేసి గట్టిగా కొట్టి చప్పుడు చేస్తూ నడిచేడు సాంబయ్య.

ఎక్కడికి వెళ్ళినా ఇటు వీడు తంతానని బెదిరిస్తున్నాడు; అనవసరంగా ఇబ్బంది పెట్టి తొందర పెట్టేసి అలజడి చేస్తున్నాడు.

అటు చూస్తే వ్యవహారాలేవీ తెల్లారడం లేదు. అవతల చెన్నపట్టణంలో ఇల్లమ్మడం తేల్లేదు. హైదరాబాదులో కొడుక్కి ఇల్లెక్కడా చక్కగా కుదర్లేదు. ఒద్దురా అంటే వినకుండా పెద్దమనవడు పోకిరీ తిరుగుళ్ళు తిరగడం మాన్లేదు. రెండో మనవరాలి కాపరానికి నీళ్ళోదులు కోక వీల్లేదు. ఈ ఊళ్ళో కట్టిన యిల్లు సాంబశివం పేరపెట్టడమా ?

సౌభాగ్యవతి పేరపెట్టడమూ? ఆ విషయం ఇంకా తేల్లేదు. అల్లుడు తాగుడు తగ్గించలేదు. నాలుగో కొడుక్కి పెద్ద ఉద్యోగమేమీ దొరకలేదు. జరుగుబిల్లి వారివ్వాల్సిన సొమ్మింకా వసూలు కాలేదు. కట్టించే ఇల్లింకా పూర్తి కాలేదు.

ఏపని చేద్దామన్నా ఏదీ పూర్తిగాకుండా ఉంది. ఎన్నాళ్ళయినా అవకుండా వుంది. చూస్తూండగా డెబ్బయ్యేళ్ళు దాటిపోయేయి. ఇప్పుడింక డాక్టర్లు చెప్పేదేమంటే :

"బ్లడ్ప్రెషరు. కదలొద్దు, తిరగొద్దు."

ఇటీజ్ డిజ్ గస్టింగ్ ఇస్ ది ఎక్స్ట్రీమ్.

సాంబయ్య నాలుగడుగులు నడిచేడు, మళ్ళీ ఆగేడు.

"ఒంటరిగాడ్ని"

ఒంటరిగా ఉన్నానన్న ఆలోచనతో భయం హెచ్చయింది.

ఎక్కడా పిట్ట మనిషి కనిపించడంలేదు. గాలి, అంతటా కట్టేసింది. రోడ్డుపక్క ఇసకలో ఎండిన తీగలు ఇనప సంకెళ్ళలా ఉన్నాయి. కొబ్బరి చెట్లు తుక్కురేగిపోయి, చింపిరి జుట్టుతో నిల్చున్న శవాల్లా కనిపిస్తు న్నాయి. రోడ్డుకి రాళ్ళు ఎక్కొచ్చేయి. పక్కన పాడుబడ్డ ఇల్లొకటి ముందున్న పాడుపడ్డ నూతిలోకి పడిపోదామని చూస్తోంది.

సముద్రమంతా పీనుగుల పెంటతో నిండిపోయి కదిలే యుద్ధ భూమిలా ఉంది; కొండ చలపల దండులా ఉంది; హాలాహలంలా ఉంది.

ఈ సమయంలో వాడొస్తే ఏం చెయ్యడం?

సరసర చప్పుడయింది. జరజర చప్పుడయింది. దబదబ చప్పు డయింది.

చూస్తే ఎవరూ లేరు.

7]

పక్కనుంచి సముద్రం పో! పొమ్మంటుంది,

అదే సముద్రం రా రమ్మంటోంది.

సాంబయ్య నెమ్మదిగా ఇసకలోకి దిగేడు.

ఇవాళ ఇంక "అట్టే దూరం నడవలేను" అనుకున్నాడు.

ఇసక మెత్తగానూ, అతి చల్లగానూ ఉంది.

కాళ్ళు, కాళ్ళేమైపోతున్నాయి? కాళ్ళకేదో ఒచ్చింది! ఏమై పోతున్నాయవి?

ఊబిలోకి దిగిపోయినట్టు ఎక్కడకో దిగిపోతున్నట్టుగా ఉంది. సాంబయ్యకి నోట్లోకొచ్చేయి. హెల్‌ప్‌లెస్‌గా పట్టుతప్పి పడిపోయినట్టు ఇసకలో కూలపడ్డాడు.

ఎగిరే కెరటాలు దబ్బున విరిగి పడుతున్నాయి!

చల్లారిన కెరటాలు హిస్సున చప్పుడు చేస్తున్నాయి.

సాంబయ్యకి తల మండిపోతోంది. కళ్ళు పేలిపోతున్నాయి. గుండె పగిలిపోతోంది.

ఒక్క క్షణం.

ఒక్క క్షణం.

ఒక్క క్షణం.

తల చల్లారింది. కళ్ళు సర్దుకున్నాయి. గుండె నిండుకొంది. కళ్ళకంతా అప్పుడు, స్పష్టంగా కనిపించింది. సుస్పష్టంగా, చిందర వందరగా కొన్ని దృశ్యాలు గబగబ జరిగిపోయేయి అలనాటి తల్లి,అలనాటి తండ్రి, ఓనమాల మాస్టరు, స్కూలు గంటలు, కొత్త దమ్మిడీలు, పాతకాసులు, పందిరికింద పెళ్ళి భార్య నవ్వు ముఖం. కొడుకు ఏడుపు ముఖం, ఉద్యోగపు ఆర్డరు, తాశీల్దారీ ఫోటో ఆర్డిటితో కోర్టు, చెక్కు బుక్కు, ఇంటి ప్లాను, ప్రహారీ గోడ....

గోడలు కట్టుకు బతికేడిన్నాళ్లూను.

గోడలమధ్య తన ఇల్లు, తన భార్య. తన పిల్లలు, తన సంసారం, తను. తన బాగు. తన గోడ.

ఉక్కిరి బిక్కిరిగా అనిపించలేదే అప్పుడు!

గోడదాటి ఎవడూ రాకూడదు.

గోడని ఆరిపి అంతా ఆక్రమించేద్దామనుకున్నాడు. గోడబైట పిల్లల నవ్వు ముఖాలు; ఎండలో పనివాళ్ళ చెమట ముఖాలు; ఆరుబైట వచ్చగడ్డిమీద బంతివెనక పరుగులు;

తోటల్లో చెట్లమీద పిట్టల కూతలు; పొలంలో ఆడవాళ్ళ పాటలు; గాలికి వరిచేల ఒంపులు; సీట్లో సిరికొండల సలుపులు; బోటునడిపినవాళ్ళ దండల కండలు: నందిడిగా స్నేహితులతో నడకలు. అవేవీ లేవు. చూల్లేను. అక్కల్లేక బోయేయి.

ఒంటరిగా నడిచేడిన్నాట్నాను.

ప్రహారీగోడ కట్టుకున్నారున్నాడు.

ఎవడూ రాకూడ దనుకున్నాడు.

కాని——

ఇప్పుడు వాడొచ్చి మండికొట్టి పడగొట్టి, కళ్ళుమూసి జెల్ల కొట్టి తన్ని తాడుకట్టి లాక్కుపోతున్నాడు.

సాంబయ్యచుట్టూ అంతా ప్రశాంతంగా ఉందా? ఉంది కాబోలు.

ఇసకలో ఒంటరిగా నిస్సహాయంగా పడివున్నాడు సాంబయ్య.

"ఒంటిగాణ్నాయి పోయేను."

ఇప్పు దేమనుకొని ప్రయోజనం లేదు.

ఇంతలో ఒక్కసారి సముద్రం తళతళ్ళాడింది

సూర్యుడు ఉదయించేడు.

సాంబయ్య కళ్ళు ఒక్కసారి మిలమిల్లాడేయి.

వంటరిగా నడిచేను.

ఒంటరిగా పోతున్నాను.

పోయేటప్పుడు ఎలానూ ఒంటరిగానే పోవాలి.

బతికినప్పుడు అందరిలోనూ బతకాలి.

అలా చేసేను కానే!

కెరటాలన్నీ సూర్యుణ్ని ఎగిరెగిరి చూస్తున్నాయి. కొబ్బరిచెట్లు తలలు సర్దుకొని నిల్చున్నాయి. ఎండిన తీగెల్లోంచి పచ్చటాకులు బైట కొచ్చేయి. ఇసక దిబ్బలు బంగారపు రాసులయేయి. గాలి ఒక్కసారి నిట్టూర్చి లేచి మెల్లగా తిరిగి అంతటినీ చల్లగా తాకింది.

సాంబయ్య నిట్టూర్చి కళ్ళు మూసుకున్నాడు.